# పొరపాటు - అలవాటు



*నిజగృహిణీ ముపగూహస్వ*
*కుక్కుట శబ్దే న ఝటితి ప్రతిబుద్ధ*
*పరవసతి వాసశంకిన్*
*నిజవాసకేపి గృహే మా భైషీః*

**భావం:** తొలి కోడి కూతకు మేలుకుని భయపడుతున్నవాడా, నీ ఇల్లాలిని దగ్గరకు తీసుకో. పరాయి ఇల్లన్న శంక కలవాడా, నీసొంతింట్లో కూడా భయపడకు.

రమాకాంతుడు బహుప్రియావ్రతుడు. బహుపత్నీ వ్రతం కన్నా బహు ప్రియావ్రతంలో సుఖమెక్కువ అని అతని నమ్మకం. కొందరు స్త్రీలు అతని అందానికీ మాటకారితనానికీ ఆకర్షితులయ్యేవారు. కొందరిని ధనంతో లొంగతీసుకునేవాడు. తరచుగా వేశ్యా వాటికలకు వెదుతూ ఉండేవాడు. అతని అదృష్టం కొద్దీ సుమతి అనే పతివ్రత భార్యగా దొరికింది. షట్కర్మ

యుక్తా కుల ధర్మపత్నీ అన్న శ్లోకం లో చెప్పబడినట్లుగా పనిలో దాసిగా సలహాలలో మంత్రిగా, భోజనంలో తల్లిగా, పడకలో రంభగా రూపంలో లక్ష్మిగా క్షమాగుణంలో భూదేవిలా ఉండాలి. సుమతి క్షమాగుణంలో భూదేవి.

అతడు ఎవరితో తిరిగినా ఏమీ అనేది కాదు. రమాకాంతుడు చాలా తెలివైన వాడు. తనతో కలిసి తిరిగే స్త్రీల విషయం వారి భర్తలకు ఎట్టి పరిస్థితులలోనూ తెలియనిచ్చేవాడు కాదు. రాత్రి రెండో జాము దాటాకా ప్రేయసి దగ్గరకు వెళ్ళడం, తెల్లారకముందు తిరిగి వచ్చేయడం అతనికి అలవాటు. ఆ కారణంగా అతడు చాలామంచివాడని ఊళ్ళో పేరు కూడా ఉంది. సుమతి తన కష్టం ఎవరికీ చెప్పుకునేది కాదు కనుక అతని సంగతి ఎవరికీ తెలియదు.

ఒకనాడు అతనికి ఏ ప్రేయసీ దొరకలేదు. వేశ్యావాటికకు వెళ్ళాడు. వారకాంతలందరూ రాజసభలో నర్తించడానికై రాజధానికి వెళ్ళారు. రమాకాంతుడు ఇంకేం చెయ్యాలో తెలియక ఇంటికి వచ్చాడు. భర్త ఇంటికి వచ్చినందుకు సుమతి మురిసిపోయింది. అప్పటికప్పుడు లేచి మంచం దిగి పంచభక్ష్య పరమాన్నాలు సిద్ధంచేసి భోజనం పెట్టింది. అందంగా సౌకర్యంగా పడక ఏర్పాటు చేసింది.

తెల్లవారక ముందు తొలికోడి కూసింది. రమాకాంతుడు ఉలిక్కిపడి లేచాడు. మంచం దిగి వెళ్ళి పోబోయాడు. సుమతికి మెలుకువ వచ్చింది.

ఆమె భర్త మనస్థితీ, పరిస్థితీ అర్థమై క్రింది శ్లోకం చదివింది. తొలికోడి కూతకు మేలుకుని భయపడినవాడా, నీ ఇల్లాలిని దగ్గరకు తీసుకో. పరాయి ఇల్లన్న శంక కలవాడా, నీ సొంత ఇంట్లో కూడా భయపడకు.

శ్లోకం పూర్తయ్యేసరికి తన దీనస్థితి గుర్తుకువచ్చి సుమతి వెక్కి వెక్కి ఏడ్చింది. శ్లోకం విన్న తర్వాత రమాకాంతునకూ అతని వంటి పరకాంతా వ్యామోహపరులకూ వ్యభిచారం పొరపాటనీ అది అలవాటుగా మారడం మరింత పొరపాటనీ తెలిస్తే ఇంకంతకన్నా కావల్సిందేమిటి?

******